క్లుప్తంగా

కొత్త మండలాలపై స్పందించాలి

మరికల్: పేట నియోజకవర్గంలో కొత్తమండలాల ఏర్పాటుపై ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి అసెంబ్లీలో ప్రస్తావించిన ప్రభుత్వం నుంచి ఎలాంటి సమాధానం రాలేదని ఇందుకు ఎమ్మెల్యే సమాధానం ఇవ్వాలని టీపీసీసీ అధికార ప్రతినిధి హర్షవర్ధన్‌రెడ్డి అన్నారు. నియోజకవర్గంలో గార్లపహాడ్, కోటకొండ, కానుకుర్తి మండలాలను ఏర్పాటుచేయాలని ఆయన గురువారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి లేఖ రాశారు. ఎమ్మెల్యే అసమర్థతతో నియోజకవర్గంలో కొత్త మండలాలు ఏర్పాటు కావడం లేదని ఆరోపించారు. ప్రభుత్వంతో కొట్లాడి మూడు మండలాలను ఏర్పాటుచేయించిన తర్వాతనే ప్రజలకు ముఖం చూపాలన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో కంటివైద్యశిబిరం



కోస్గి: లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం కంటివైద్య శిబిరాన్ని నిర్వహించారు. దాదాపు 80మందికి కంటిపరీక్షలు నిర్వహించగా అందులో 35మందిని కంటి ఆపరేషన్‌కోసం రాంరెడ్డి కంటి ఆస్పత్రికి తరలించినట్లు డాక్టర్ గాయత్రి, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు వెంకట్‌రాములు తెలిపారు. కార్యక్రమంలో భాస్కర్‌గౌడ్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



మరికల్: మండలంలోని రాకొండలో పోలింగ్ బూత్‌లను గురువారం తహసీల్దార్ సునిత పరిశీలించారు. పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన గదులకు ఓటర్లకు కన్పించేలా క్రమసంఖ్య నంబర్లు ఉండాలని సిబ్బందికి సూచించారు. అలాగే ఇతర సౌకర్యాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాజు, ఆర్‌ఐ శ్రీశైలం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు అందజేత



మక్తల్: మండలంలోని అనుగొండ ఎంపీపీఎస్ పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ గడ్డం రమేష్, ఎంపీటీసీ పద్మమ్మ చేతులమీదుగా గురువారం విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు అందజేశారు. గ్రామానికి చెందిన కే.శే అన్నపూర్ణ జ్ఞాపకార్థంగా ఆమె భర్త బస్వరాజ్ తనసొంత ఖర్చులతో వందమంది విద్యార్థులకు గ్లాసులు, ప్లేట్లు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటేష్, వీరన్న, బస్వరాజు, ఎస్‌ఎంసీ చైర్మన్ లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభం



నారాయణపేట రూరల్: మండలంలోని ఎక్లాస్‌పూర్ శివారులోని లోకాయపల్లి లక్ష్మమ్మ ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గురువారం పట్టణంలోని సోమశేఖరస్వామి ఇంటి నుంచి అమ్మవారి పల్లకీసేవా కనుల పండువగా ఆలయం వరకు కొనసాగింది. పట్టణ పురవీధుల గుండా భజనా సంకీర్తనలతో ముందుకు సాగుతుండగా, భక్తులు పెద్ద ఎత్తున హాజరై దర్శించుకున్నారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నెలరోజులపాటు ప్రతి శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో రాంబాబు, మధుసూదన్‌రెడ్డి, కన్నజగదీష్, దినేష్‌లాహోటీ, రవికుమార్‌గౌడ్, సర్పంచ్ జమునాబాయి, ఎంపీటీసీ రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూర్: పవిత్ర శ్రావణమాసం సందర్భంగా ప్రముఖ సాయిక్షేత్రమైన శ్రీసాయిబాబా మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో వాసవీ క్లబ్ రిజియన్ చైర్మన్ రాముని నీలేష్, భాగ్యలక్ష్మి రైస్‌మిల్ అధినేత సింగందయ్‌లు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. వెంకటస్వామి, పావని, నవీన్, వీణశ్రీ, గాయత్రి, శ్రీధర్, గీత, వెంకటేష్, రమేష్, రామకృష్ణ, గోపి, మల్లేష్, భక్తులు పాల్గొన్నారు.

ప్రయాణం.. నరకప్రాయం

- కున్సి రైల్వే వంతెన కింద అధ్వానంగా మారిన బీటీరోడ్డు
- రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు
- ప్రమాదాలకు అడ్డాగా మారిందని ఆవేదన



రోడ్డుకు అడ్డుగా పడిపోయిన లారీ (ఫైల్)



రెల్వేబ్రిడ్జి సమీపంలోని బీటీరోడ్డు పరిస్థితి ఇలా..

కృష్ణా: మండలంలోని కున్సిగ్రామ సమీపంలో రైల్వే వంతెనకింద ఉన్న బీటీరోడ్డు కాస్త గుంతల మయంగా మారి ప్రతిరోజూ ప్రయాణికులు ప్రమాదాల భారీన పడుతున్నారు. ఇటీవల రైల్వే కాంట్రాక్టర్ నిర్మించిన సీసీరోడ్డు కూడా నాణ్యతగా లేక వంతెనకింద నిర్మించిన సీసీరోడ్డును కలుపుతూ ఉన్న బీటీరోడ్డును కూడా వేయాల్సి ఉంటుంది. కాని వారు తమపని ముగించుకొని ఎక్కడికక్కడ వదిలివేయడంతో రోడ్డుపై రాత్రిసమయంలో ప్రయాణికులకు రోడ్డు ఎక్కడుందో తెలియక ప్రమాదాలకు గురవుతున్నారు. గతవారంరోజుల క్రితం మహారాష్ట్ర నుంచి కర్ణాటకకు కందులలోడుతో వెళ్తున్నా లారీ కాస్తా బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ కొద్దిపాటి గాయాలతో ప్రాణాలతో బయటపడ్డాడు. అసంపూర్తిగా ఉన్న రోడ్డును పూర్తిచేయాలని గ్రామస్తులతో పాటు మండల నాయకులు విజ్ఞప్తిచేస్తున్నారు.

ప్రాణాలు అరచేతిలో..

హిందుపూర్, కున్సిగ్రామానికి మధ్యన ఉన్న బీటీరోడ్డు పూర్తిగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. ఎండాకాలంలో సరే ఎలాగైనా ప్రయాణిస్తాం. వర్షాకాలంలో అయితే రోడ్డుపై ప్రయాణమంటేనే నరకం చూస్తున్నాం. ఒక్కోమారు ఇందులో ఓవర్‌లోడ్‌తో వెళ్లేవాహనాలు రోడ్డుపక్కన ఇరుకుపోతున్నాయి. ఈ విషయంపై పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు.



– నల్లె నర్సప్ప, కున్సి గ్రామం

ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలి

మాగనూర్: ఉపాధ్యాయులు విధిగా సమయపాలన పాటించాలని మండల నోడల్ అధికారి వెంకటయ్య అన్నారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలను ప్రార్థన సమయానికి చేరుకుని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం తరగతి గదులను పరిశీలించి, ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. పాఠ్యాంశలపై ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. పేద విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించి విద్యాభివృద్ధికి కృషిచేయాలని సూచించారు. విద్యార్థులచే పాఠ్య పఠనం చేయించారు. విద్యార్థులు చదవడం, రాయడం విద్యార్థులకు నేర్పించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శివరాజ్, ఉపాధ్యాయులు, సీఆర్పీలు కృష్ణ, ఎల్లాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ప్రార్థనలో పాల్గొన్న నోడల్ అధికారి వెంకటయ్య

ట్రావెల్ బస్సు, బైక్ ఢీ.. ఇద్దరికి గాయాలు

మక్తల్: ప్రైవేట్ ట్రావెల్ బస్సు, బైక్ ఢీకొని ఇద్దరు గాయపడిన సంఘటన మక్తల్‌లో గురువారం చోటుచేసుకుంది. వివరాలిలా.. మక్తల్‌కు చెందిన కుమ్మరి సందప్ప తన మనుమరాలు సునీతతో కలిసి బైక్‌పై ఆంధ్రాబ్యాంక్ దగ్గర రోడ్డు దాటుతుండగా వేగంగా వచ్చిన ట్రావెల్స్ బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరికీ తీవ్రగాయాలు కాగా.. బస్సు రోడ్డు పక్కన కూరుకుపోయింది. వెంటనే స్థానికులు క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు. గాయాలపాలైనా వారిని వెంటనే మక్తల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చంద్రన్న పరిస్థితి విషమంగా ఉండటంతో మహబూబ్‌నగర్‌కు తరలించారు. ఈ ఘటనపై సందప్ప బంధువు ఆంజనేయులు ఫిర్యాదు మేరకు కేసునమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పర్వతాలు తెలిపారు.

ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

మద్దూరు: ఓపెన్‌స్కూల్ వాల్‌పోస్టర్‌ను గురువారం కొడంగల్‌లోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓపెన్ స్కూల్ సమన్వయకర్త దాసు మాట్లాడుతూ.. ఆర్థిక పరిస్థితు వల్ల చదువును మధ్యలో ఆపేసినా వారు మళ్లీ చదువుకోవడానికి మంచి అవకాశమని ఆయన తెలిపారు. వివరాల కోసం 9701730724, 9440385145 నంబర్లకు సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఫైనాన్స్ కమీషన్ డైరెక్టర్ సలీం తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా పోస్టర్ ఆవిష్కరణ



కోస్గి: ఉపాధ్యాయుల పీఆర్‌సీ ప్రకటించాలని, సీపీఎస్‌ను రద్దుచేయాలని తదితర డిమాండ్లసాధనకు ఈ నెల 19న హైదరాబాద్‌లోని ఇందిరపార్క్ లోధర్నా చేపట్టనున్నట్లు తపస్ మండల అధ్యక్షుడు రవీందర్‌నాయక్ తెలిపారు. గురువారం మండలంలోని ఉన్నతపాఠశాల ఆవరణలో మహాధర్నాపోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని, 317 జీవో బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తపస్ నాయకులు గిరిజ, అనంతయ్య, రామకృష్ణారెడ్డి, సురేష్, బీమ్లానాయక్, నరేష్, నార్యానాయక్, ఎలిజబెత్, పారిజాత పాల్గొన్నారు.

గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన ప్రారంభం

మరికల్: ప్రభుత్వం ఇళ్లులేని పేదలకోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన గురువారం నుంచి అధికారులు ప్రారంభించారు. మండలంలో ఆరువేలకు పైగా వచ్చిన దరఖాస్తులను ఇంటింటికీ తిరిగి పరిశీలించేందుకు టీంల వారీగా వెళ్లి దరఖాస్తుదారులు ఉన్న ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తున్నారు. ప్రతి గ్రామంలో రెండునుంచి 5 టీంల వారీగా గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిల్లో పరిశీలన చేపట్టారు. ఒక్కొక్క ఇంటివద్ద పదినిమిషాల చొప్పున సమయం తీసుకోవడంతో కనీసం 50దరఖాస్తులను పరిశీలన చేయలేకపోతున్నామని సిబ్బంది తెలుపుతున్నారు.

ధన్వాడ: ప్రభుత్వం ఇళ్లులేని పేదలకోసం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి దరఖాస్తుల పరిశీలన గురువారం నుంచి అధికారులు ప్రారంభించారు. ప్రతి గ్రామంలో రెండునుంచి 5 టీంల వారీగా గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్రస్థాయిల్లో పరిశీలన చేపట్టారు.



కొండాపూర్‌లో దరఖాస్తుదారుల వివరాలు సేకరిస్తున్న ఎంపీడీఓ సద్గుణ

కృష్ణయ్య అరెస్ట్ అక్రమం

మద్దూరు: రాజ్యసభ ఎంపీ, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్యను అరెస్ట్ అక్రమమని నియోజకవర్గ బీసీసంఘం అధ్యక్షుడు బస్వరాజ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అవుట్‌సోర్సింగ్ కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని ధర్నాచేస్తే అరెస్ట్ చేయడం హేయమైన చర్య అన్నారు. అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు.

పూర్వ విద్యార్థుల చేయూత



ఆర్థికసాయం అందజేస్తున్న పూర్వవిద్యార్థులు

మరికల్: అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న ఇద్దరు స్నేహితులకు పూర్వ విద్యార్థులు తమ ఉదారత స్వభావం చాటుకొని వారికి తోచిన సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. మరికల్‌కు చెందిన 1994–95 పూర్వ విద్యార్థుల్లో సీమ శ్రీనివాస్, నాగరాజ్ గతకొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వారికి వైద్యఖర్చుల నిమిత్తం గురువారం ఒక్కొక్కరికీ రూ. 25వేల చొప్పున రూ. 50వేలను స్నేహహస్తం అందజేసి మానవత్వం చాటుకున్నారు. కార్యక్రమంలో శివరాంప్రసాద్, వరలక్ష్మి, మధు, కమల్, ప్రకాష్, చంద్రశేఖర్, రవి, సాల్వ రెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

పట్టణంలో పారిశుద్ధ్యం పనులు

అమరచింత: పట్టణంలోని ఆయా వార్డుల్లో పారిశుద్ధ్యం పనులు విస్తృతంగా చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ మహమ్మద్ ఖాజా తెలిపారు. ఆరు, ఏడో వార్డులతో పాటు ఎనిమిదో వార్డులో బ్లీచింగ్ పౌడర్, ఫాగింగ్ చేసినట్లు తెలిపారు. మున్సిపల్ సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఇంటర్‌ప్రవేశాలకు గడువు పొడగింపు

ధన్వాద: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు చివరి గడువును ఈనెల 30వ తేదీవరకు పొడిగించినట్లు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ అబ్దుల్ ముజీబ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. సమాచారంకోసం 8247028307, 9494266258 నంబర్లకు సంప్రదించాలన్నారు.

పారిశుద్ధ్యంపై నిర్లక్ష్యం చేస్తే చర్యలు

ఊట్కూరు: పారిశుద్ధ్యం పనులపై నిర్లక్ష్యం వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ కతలప్ప అన్నారు. గురువారం నాగర్లబండ తండాలో గ్రామ పంచాయతీ, అంగన్‌వాడీ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం గృహలక్ష్మి దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు పరిశీలించారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పనులను నిర్లక్ష్యం చేస్తే అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితి నెలకొంటుందన్నారు. పంచాయతీ ఉద్యోగులు, కార్మికులు పారిశుద్ధ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



నాగర్లబండ తండాలో పారిశుద్ధ్యం పనులు పరిశీలిస్తున్న ఎంపీడీఓ కతలప్ప

ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రంపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మాగనూర్: మండలంలోని తళంకేరిలో గురువారం ఎన్నికలఓటింగ్ యంత్రం (ఈవీఎం)పై కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వీవీప్యాట్‌లు పనిచేసే విధానంపై కళాజాతతో అవగాహన కల్పించారు. స్వయంగా ఓటువేసి అనుమానాలను నివృతి చేసుకునేందుకు డెమో ఈవీఎంలు ఏర్పాటుచేశారు. ఈ అవకాశాన్ని ప్రజలు, ఓటర్లు సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఐ శ్రీశైలం కోరారు. కార్యక్రమంలో తళంకేరి సర్పంచ్ రామస్వామి, ఉపసర్పంచ్ బాలప్ప, కళాజాత బృందం, కానిస్టేబుల్ కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన కరపత్రం విడుదల

ఊట్కూరు: మండలంలోని గుడిగండ్లలో హరిహర క్షేత్రంలో నిర్వహించే ఆత్మీయ సమ్మేళన కరపత్రాన్ని గురుస్వామి భగవంతు గురువారం విడుదలచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలోని అయ్యప్పభక్తులు సమ్మేళనంలో పాల్గొనాలని కోరారు. 27న ఉదయం ధ్వజారోహణం, సాయంత్రం గోపూజ, మృత్యుంజయ హోమం, పూర్ణాహుతి, మధ్యాహ్నం అన్నదానం నిర్వహిస్తారని తెలిపారు. అయ్యప్ప భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో గురుస్వాములు రఘువీర్, సమ్మిరెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాన్ని విడుదల చేస్తున్న గురుస్వామి

విద్యారంగ సమస్యల సాధనే ధ్యేయం



విద్యార్థులతో సభ్యత్వ నమోదు చేయిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్: విద్యారంగ సమస్యల సాధనే ధ్యేయంగా ఏబీవీపీ కృషిచేస్తుందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ నరేష్ అన్నారు. గురువారం పట్టణంలోని వివిధప్రైవేట్ పాఠశాలలో ఆ సంఘం సభ్యత్వనమోదును చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యారంగంపై చిన్నచూపు చూస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన భోజనం అందడంలేదని, సమయానికి పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్స్ ఇవ్వడం లేదని దుయ్యబట్టారు. కార్పొరేట్‌ను ప్రోత్సహిస్తుందని, పేద, మధ్యతరగతి విద్యార్థులకు అందని ద్రాక్షలా మార్చేప్రయత్నం చేస్తుందని విమర్శించారు. ఉద్యమాల ద్వారానే సమస్యలను సాధించుకుందామన్నారు. కార్యక్రమంలో నగర కార్యదర్శి చరణ్‌రెడ్డి, రాష్ట్రకార్యవర్గ సభ్యులు ఇంతియాజ్, కార్యదర్శి ఆకాష్, వెంకటేష్, సాయి, నవీన్, నరేష్ పాల్గొన్నారు.

పెద్ద చెరువులో చేపపిల్లల విడుదల



చెరువులో చేపపిల్లలను వదులుతున్న నాయకులు

ధన్వాడ: మండలంలోని పెద్దచెరువులో గురువారం మత్స్యకార్మిక సంఘం అధ్వర్యంలో చేపపిల్లలను వదిలారు. ఈ మేరకు మత్స్యకార సంఘం మండల అధ్యక్షుడు నర్సింహులు మాట్లాడుతూ రూ.3,50లక్షలతో కైకలూరు నుంచి 2,50 లక్షల చేపపిల్లలను సంఘం ద్వారా కొనుగోలుచేసి చెరువులో చేపపిల్లలను వదిలినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు బాల్ నర్సింహులు, కార్యదర్శి నర్సింహులు, డైరెక్టర్లు ఆనంద్, బాలస్వామి, అశోక్, శ్రీనివాసులు, నారాయణ, బాబా, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు నీడలో సంక్షేమ వసతి గృహాలు



మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి కిరణ్

అమరచింత: రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ వసతి గృహాల్లో వసతులు కల్పించడంలో పూర్తిగా విఫలమైందని, ప్రకటనలు చేయడం తప్ప చేసిందేమీ లేదని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి డీ కిరణ్ తెలిపారు. మండల కేంద్రంలో గురువారం ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో నిర్వహించే సమరభేరి జీపుయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో జీపుయాత్ర నిర్వహించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుంటామన్నారు. మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని సందర్శించి సమస్యలు తెలుసుకున్నారు. మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలను మంజూరు చేశామని చెబుతున్న ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి కళాశాలను వెంటనే ప్రారంభించాలని కోరారు. విద్యారంగ సమస్యలతో పాటు వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలపై ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో రాజీలేని పోరాటం చేస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ఆది, సహాయ కార్యదర్శి రాఘవ, కుమార్, మల్లేష్, వంశీ, ఈశ్వర్, వినయ్, రమేష్ పాల్గొన్నారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు

నారాయణపేట రూరల్: బీజేపీ పట్టణ, మండల నాయకులు గురువారం తహసీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చేతివృత్తిదారులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రూ.లక్ష ఆర్థికసాయంతోపాటు గృహలక్ష్మి పథకం అర్హులకు దక్కడంలేదని వివరించారు. నిజమైన నిరుపేదలకు అందేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీ.శ్రీనివాసులు, నర్సింహులు, సాయిబన్న, రాము పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వం అమలు చేస్తున్న దళితబంధు, బీసీబంధు, గృహలక్ష్మి పథకాల్లో రాజకీయ ప్రమేయం లేకుండా అర్హులను గుర్తించాలని బీజేపీ ఆధ్వర్యంలో గురువారం తహసీల్దార్ సునితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు తిరుపతిరెడ్డిమాట్లాడుతూ.. గృహలక్ష్మి పథకంలో అసలైన వారిని అధికారులే గుర్తించి ప్రభుత్వానికి సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో వేణు, రమేష్, నరేష్‌గౌడ్, చెన్నయ్య, ప్రకాశ్ పాల్గొన్నారు.

ఊట్కూరు: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తహసీల్దార్ తిరుపతయ్యకు వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా కార్యదర్శి భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైయ్యారని ఆరోపించారు. గృహలక్ష్మి పథకంలో నిరుపేదలకు ఖాళీస్థలం ఉన్న వారికి రూ. 3లక్షలు వెంటనే ఇవ్వాలని, కొత్తరేషన్ కార్డులు లేనివారికి మంజూరు చేయాలని డిమాండ్‌చేశారు. ఎంపీటీసీ హన్మంతు, కిరణ్, నాయకులు జే లక్ష్మణ్, వెంకటయ్య, దళితమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాల్, ఆశప్ప, వెంకటేష్‌గౌడ్, కోటి, రాజు తదితరులు పాల్గొన్నారు.



పేటలో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

మక్తల్: బీజేపీ ఆధ్వర్యంలో గురువారం మండలంలోని తహసీల్దార్ సువర్ణరాజుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు.. ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, నిరుపేదలకు ఖాళీస్థలం ఉన్న అర్హులకు రూ. 3లక్షలు వెంటనే మంజూరుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కర్నిస్వామి, ఎంపీటీసీ బాల్‌రాంరెడ్డి, చంద్రశేఖర్, మండల బీజేపీ అధ్యక్షుడు లక్ష్మణ్, నర్సింహారెడ్డి, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మరికల్‌లో తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

కోస్గి: కేసీఆర్ పాలనలో అర్హులకు సంక్షేమ పథకాలు అందకుండా పోయాయని, వెంటనే అర్హులందరికీ పథకాలను అందజేయాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని గురువారం మండలంలోని తహసీల్దార్ లతారెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో కొటకొండ రాము, సీబీ వెంకటేష్, కృష్ణ, రాంబాబు, యాదయ్యగౌడ్, పద్మ, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మద్దూరు: కేసీఆర్ ప్రకటించిన సంక్షేమ పథకాలన్ని అర్హులకు అందజేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మద్దూరు, కొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయాల ఎదుట బీజేపీ నాయకులు ధర్నా చేపట్టారు. ఈ మేరకు అర్హులకు డబుల్‌బెడ్రూం, నిరుద్యోగభృతి అందజేయాలని వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కార్యాలయ సిబ్బందికి అందజేశారు. శంకర్, సుధాకర్‌రెడ్డి, సాయిలు, రామచారి, ఆంజనేయులు, వెంకట్, హన్మంతు, భరత్, తదితరులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

ఆత్మకూర్: మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు తెలిపారు. సమావేశానికి మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హాజరవుతారని, ఆయా శాఖల అధికారులు నివేదికలతో రావాలని తెలిపారు.

బీసీబంధు చెక్కుల పంపిణీ..

ప్రభుత్వం అందిస్తున్న బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు ఎమ్మెల్యే చిట్టెం అందజేస్తారని మండల అధ్యక్షుడు రవియాదవ్ తెలిపారు.